గంగమ్మ ఒడికి గణనాథులు



తాండూరులో వినాయక శోభాయాత్ర




కోలాటం ఆడుతున్న చిన్నారులు

- తాండూరులో వైభవంగా శోభాయాత్ర
- ఆకట్టుకున్న నృత్యాలు, భజనలు

తాండూరు /యాలాల ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఐదు రోజులపాటు పూజలందుకున్న గణపయ్యకు తాండూరు వాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. 'ఓ బొజ్జగణపయ్య.. మీ బంటు మేమయ్య' అంటూ ఆటపాటలతో గణేశ్ శోభాయాత్ర ముందుకుసాగింది. ఆదివారం పాత తాండూరు నుంచి కోలాహలంగా వినాయక నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. అర్ధరాత్రి వరకు వినాయక నిమజ్జనాలు కొనసాగాయి. ఎటుచూసినా సందడి కనిపించింది. తాండూరు భద్రేశ్వర్ చౌక్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద సామూహిక గణపతులకు చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్‌లు రాజుగౌడ్, మురళిగౌడ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్‌లు లక్ష్మారెడ్డి, స్వప్న, నాయకులు కరుణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు పట్లోళ్ల నర్సింహులు, పర్యాద రామకృష్ణ, తదితరులు ఘన స్వాగతం పలికారు. నిమజ్జనం సందర్భంగా 300 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు.



కోకట్ కాగ్నా నదిలో వినాయకుడి నిమజ్జనం



వినాయక శోభాయాత్రలకు స్వాగతం పలుకుతున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు



తాండూరు పట్టణం సీతారాంపేట్‌లో లడ్డూను దక్కించుకున్న భానురేఖ దంపతులు

లడ్డూ.. రూ.4,55,555

తాండూరులోని సీతారాం వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో వినాయకుడి లడ్డూను మంచాల భానురేఖ, అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.4,55,555లకు దక్కించుకున్నారు. కన్య పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి వద్ద యువకుడు చెనిమిళ్ల మనిష్ కుమార్ రూ.3,01,116కు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. అలాగే బాలాజీ మందిరంలో మార్వాడి గణేష్ సమితి ఆధ్వర్యంలో వ్యాపారి నందకిషోర్ పర్థాని రూ.2లక్షల 50వేలకు దక్కించుకోగా, భద్రేశ్వర్ చౌక్‌లో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు రూ.లక్షకు లడ్డూ దక్కించుకున్నారు. అలాగే తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జినగుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ రూ.21వేలకు లడ్డూ దక్కించుకున్నారు. శ్రీనివాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు.



హస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

తాండూరు/తాండూరు రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా జినగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సందిపని గురుకులం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. ఏకలవ్య ఫౌండేషన్‌లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంతోపాటు నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమన్నారు. అనంతరం జినగుర్తి ఏకలవ్య కేంద్రంలో సింధూర గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నేతలు కేంద్ర మంత్రిని ఘనంగా సన్మానించారు.

సేంద్రియం.. అభినందనీయం


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకువస్తుందన్నారు. తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించేందుకు ఏటీసీలు ఏర్పాటు చేశామని తెలిపారు. తాండూరులో రూ.2కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం తాండూరు ప్రాంతంలో కేంద్రియ విద్యాలయంతోపాటు నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనస్సు పెట్టి పని చేస్తేనే ఏదైనా సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ రియల్ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ జమ్మూకశ్మీర్ ప్రతినిధి సతీష్‌చంద్ర, ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకర్త సదస్య బాగయ్య, సందిపని గురుకుల ఛైర్మన్ డాక్టర్ మల్లారెడ్డి, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఛైర్మన్. డా.పి. వెంకటేశ్వర్లు, ఆర్బీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలకు వెళ్లాలని పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మొదట పార్టీల గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత పార్టీల రహితంగా నిర్వహించే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామనేది ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

స్థానిక సమరానికి సమాయత్తం

పల్లెల్లో నెలకొన్న ఎన్నికల కోలాహలం

- మొదట పరిషత్.. ఆ తర్వాతే పంచాయతీ ఎలక్షన్స్
- బీసీ రిజర్వేషన్లతో మైలేజీ పెంచుకునే యోచనలో కాంగ్రెస్
- చకచకా ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- పరిషత్ ఎన్నికలకు ఓటర్ల జాబితా
- పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల





వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రాగానే సెప్టెంబర్ మొదటి వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి రెండు విడతల్లోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఎన్నికలు ముగియగానే వెంటనే పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మొదట రిజర్వేషన్ల ఫార్ములాను ఖరారు చేయాల్సి ఉంది. ఈ ఫార్ములా ప్రకారం

మిగతా 8వ పేజీలో...

ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం

ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా సంసిద్ధంగా ఉండేవిధంగా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. 2వ తేదీన పంచాయతీ ఓటర్ల తుది జాబితా ప్రచురణ, 10న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఖరారు కానున్న నేపథ్యంలో ఎన్నికల మిగతా ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి సారించింది. బ్యాలెట్ ప్రింటింగ్ కోసం పేపర్ ఆర్డర్ చేయడం, ప్రింటింగ్ ప్రెస్‌లను గుర్తించి ఎంపిక చేయడం, ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల చేతి వేలిపై గుర్తు వేసే ఇంకు, ఇతర స్టేషనరీ సామగ్రి సమకూర్చుకోవడం వంటి పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఓటర్ల తుది జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించగానే ఈ పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి.

ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

- డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు తమ వేలిముద్ర సహాయంతో వంద శాతం ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 5,37,810 రేషన్‌కార్డులకు సంబంధించి 18,65,353 మంది లబ్ధిదారులు ఉండగా అందులో ఇప్పటివరకు 13,19,111(70.72) శాతం మంది మాత్రమే ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని తెలిపారు. మిగతా 5,46,242(29.28) వారు త్వరగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ నెలలో అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని కోరారు. ఐదేళ్ల పూర్తికాని పిల్లలకు ఈకేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రేషన్‌షాపు డీలర్లు కూడా రేషన్ షాపులను తెరిచి ఉంచి ఈకేవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.



రైతన్న కష్టం.. వరద పాలు!

నీటిలోనే పంటపొలాలు

కుళ్లిపోతున్న పత్తి, కంది పంటలు

రైతన్నలకు తీవ్ర నష్టం

8

మంచం పట్టిన మాజీ సర్పంచ్

చేసిన పనులకు బిల్లులు రాక మనోవేదన

6

వేధింపులు తట్టుకోలేక భర్తను కడతేర్చిన భార్య



కురువ కుమార్(ఫైల్)

మోమిన్‌పేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తట్టుకోలేని ఓ భార్య అతడిని కడతేర్చిన సంఘటన మండలంలోని కేసారం గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో జరిగింది. గ్రామస్థులు, ఎస్సై అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం బంటారం మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన కురువ కుమార్(35) రెండు సంవత్సరాలుగా మండలంలోని కేసారం గ్రామంలోని ఓ వెంచర్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన భర్త భార్య రేణుక, పిల్లలను వేధించడం తట్టుకోలేక భర్త కళ్లలో కారం చల్లి చీరతో మెడను బిగించి హతమార్చింది. వీరికి మనోజ్(8), సందీప్(6) ఇద్దరు కుమారులు ఉన్నారు. కురువ కుమార్ తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసనలు



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీజేపీ నేతలు ఆందోళనలు చేపట్టారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. మోదీపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ తీరును మొన్నటికి మొన్న సుప్రీం కోర్టు సైతం తప్పుపట్టిందని, నువ్వు నిజమైన దేశ పౌరుడివా అని ప్రశ్నించినా ఆయన బుద్ధి మారలేదన్నారు. నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశానికి ప్రధాని అని, అలాంటి వ్యక్తి మాతృమూర్తిపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మోదీని గద్దె దించడం కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి తరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్, మాదవి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కీసరలో గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్

పనుల్లో వేగం పెంచాలి

- రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్

కీసర/శామీర్‌పేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ ఆదేశించారు. కీసరలో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ పనులను ఆదివారం పరిశీలించి నిర్మాణ పనుల్లో జాప్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయిస్తామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అలాగే పాఠకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ మాల్కాజ్‌గిరి గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేష్‌బాబు, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల కృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, మాజీ ఎంపీటీసీ రమేష్ గుప్తా, చర్లపల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని అందుబాటులోకి తెస్తాం

అలియాబాద్‌లో గ్రామీణ గ్రంథాలయ భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామీణ గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. గ్రంథాలయాల్లో పాఠకులకు అవసరమైన అన్ని సౌకర్యాలను, పుస్తకాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనవెంట మేడ్చల్ జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైరన్, నర్సింహాయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కమరం కృష్ణారెడ్డి ఉన్నారు.



అవార్డును అందుకుంటున్న శిక్షకుడు రమేశ్

కొడంగల్ కలారికి ఎక్స్‌క్లూజివ్ వరల్డ్ రికార్డ్ అవార్డు

కొడంగల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ కైలరీ కలారి సంఘం ఎక్స్‌క్లూజివ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామదాసు చేతులమీదుగా కలారి శిక్షకుడు రమేశ్ పురస్కారం అందుకున్నారు. ప్రాచీన యుద్ధ విద్యను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రమేశ్‌ను పలువురు అభినందించారు.


కల్వర్టుపై గుంతల్లో నిలిచిన నీరు

గుంతలతో వాహనదారుల ఇబ్బందులు

దుద్యాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని హకీంపేట్ శివారులో కల్వర్టుపై గుంతలేర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోస్గి రోడ్డులో ఉన్న కల్వర్టుపై గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిలుస్తోంది. వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే రోడ్డులో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

యూరియాను అందించడంలో కేంద్రం విఫలం


సోమారపు రవి

మోమిన్‌పేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ఎస్సీసెల్ చేవేళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి సోమారపు రవి ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన యూరియా కోటాను తగ్గించడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించేందుకు ఆందోళనలు చేస్తున్నారన్నారు. వానకాలం సీజన్ వరకు 8.30లక్షల టన్నుల యూరియాను ఇవ్వాల్సి ఉండగా కేంద్రం ఇప్పటి వరకు 5.72లక్షల టన్నులే ఇచ్చిందన్నారు. దీంతో యూరియా కొరత ఏర్పడుతుందన్నారు.

కలర్ చాంప్-2025 పోటీలు

- మా హైదరాబాద్ 2025 థీమ్‌తో నిర్వహణ
- ఊహాత్మక చిత్రాలు గీసి ఆకట్టుకున్న బాలబాలికలు


శైలజారెడ్డి, దినేష్‌విక్టర్‌లకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

శంషాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని ఎస్సార్ క్లాసిక్ కన్వెన్షన్‌లో ఆదివారం గ్లోబల్ ఆర్ట్ అకాడమి 'కలర్ చాంప్-2025' పోటీలను నిర్వహించింది. నగరంలోని 26 పాఠశాలల నుంచి 570 మంది విద్యార్థులు ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. తమ శిక్షణను బట్టి గంటపాటు ఊహా చిత్రాలను గీసేందుకు సమయమిచ్చి పోటీలు నిర్వహించారు. 'నా నగరం హైదరాబాద్ 2025' అనే థీమ్‌తో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజారెడ్డి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా ఎస్‌ఐపీ అకాడమీ ఎండీ దినేష్‌విక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సృజనాత్మక కళల్లో పాల్గొనే విద్యార్థుల్లో సమస్యల పరిష్కార నైపుణ్యాలు, భావోద్వేగ ధైర్యం పెరుగుతాయని తెలిపారు. స్కిల్ డెలవప్‌మెంట్ ప్రోగ్రాంలపై ప్రభుత్వం జీఎస్టీని మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ట్, అబాకస్, డ్యాన్స్, మ్యూజిక్, యోగా, లాంగ్వేజెస్ అనేవి లగ్జరీలు కావని, విద్యార్థుల్లో స్కిల్స్ పెంపొందించే కార్యక్రమాలన్నారు. ఎగిరే ఆటోలు, ఇంద్ర ధనస్సు, రంగుల సరస్సులు, రోబో పోలీసులు డ్రోన్ బిర్యానీలు.. ఇలా రకరకాల ఆర్ట్ నైపుణ్యాన్ని విద్యారులు ప్రదర్శించారని తెలిపారు. ఇలాంటి పోటీలతో పిల్లల్లోని ప్రతిభ వెలికి వస్తుందని, నైపుణ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. అలాగే పిలల్లో పోటీ తత్వం పెరిగి జీవితంలో ఎదిగేందుకు దోహదం చేస్తాయన్నారు.


ఆర్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


తాను గీసిన ఊహాచిత్రాన్ని చూపుతున్న బాలిక

ఇచ్చిన మాట ప్రకారం గ్యారెంటీల అమలు

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తాము పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని, ప్రజల కోసం పరితపించే నాయకుడు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆయన మన ఎమ్మెల్యే కావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, వెంకటయ్య గౌడ్, బందయ్య, రామకృష్ణారెడ్డి, రాములు, లాలయ్య, నర్సిములు, జమీల్, ఈశ్వర్, రాములు పాల్గొన్నారు.


ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

తలకొండపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టణాలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తూ వసతులు కల్పిస్తుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో ఎంపీ మల్లు రవి సహకారంతో రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తిలతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు వెంకట్‌రెడ్డి, ఆరిఫ్, అశోక్, రవి, శ్రీశైలం, రమేశ్, రేణురెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న యాట నర్సింహ

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా సీహెచ్.వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్ష పదవికోసం ఆదివారం జరిగిన ఎన్నికల్లో వెంకట్‌రెడ్డి, కె.మాధవరెడ్డి పోటీపడ్డారు. ఇందులో వెంకట్‌రెడ్డి 82ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా శివప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘం ప్రతినిధులు అభినందించారు.


ఘట్‌కేసర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గంతో సంఘ ప్రతినిధులు

బీసీ రిజర్వేషన్ల తీర్మానం అభినందనీయం

కొడంగల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలుచేస్తూ ఆదివారం అసెంబ్లీలో తీర్మానించడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బల్ల యాదగిరి పటేల్ అన్నారు. ఆదివారం మద్దూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తుడటం గొప్ప విషయం అన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు మన్నె బస్వరాజ్, నర్సయ్య, చంద్రశేఖర్‌గౌడ్, నాగప్ప పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాఠశాలలో విద్యుత్ సమస్య పరిష్కారం

బొంరాస్‌పేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలోని మేడిచెట్టు తండా పంచాయతీ పరిధిలోని బోడబండ తండా పాఠశాలలో విద్యుత్ సమస్యను స్థానిక నాయకులు పరిష్కరించారు. పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేదని అంగన్‌వాడీ టీచర్ కాంగ్రెస్ నాయకుల దృష్టికితీసుకెళ్లారు. స్పందించిన మోహన్‌నాయక్, వనిఓద్‌నాయక్, రాజునాయక్, నవీన్‌నాయక్‌లు ఆదివారం పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి లైట్లు వేయించారు. తండా వాసులు, టీచర్లు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

చెన్నారంలో తాగునీటి ఎద్దడి

- పట్టించుకోని అధికారులు ● మహిళల ఆందోళన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

యాలాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తమకాలనీలో తాగునీరు రావడంలేదని చెన్నారం గ్రామస్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. పానాదుల గల్లీలో రెండు రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి తనకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కొందరు గ్రామస్థులు అధికారులకు ఫోన్ చేసి సమస్యపై సమాచారమిచ్చారు. పానాదుల గల్లీకి వెంటనే నీళ్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఆలయ ఆవరణలో సిమెంట్ బెంచీల ఏర్పాటు


ఆలయ ఆవరణలో సిమెంట్ బెంచీలపై కూర్చున్న గ్రామస్థులు

తలకొండపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):దేవుని పడకల్ గ్రామంలో మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. తన తండ్రి సాయన్న జ్ఞాపకార్థం రూ.31వేలతో సమకూర్చిన 12సిమెంట్ బెంచీలను బస్టాండ్, వేంకటేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామస్థులు శ్రీశైలంను అభినందించారు. నాయకులు రామస్వామి, సత్యం, లక్ష్మయ్య, నవీన్, శంకర్, యాదయ్య, బాలయ్య, వెంకటయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్మికులకు రెగ్జిన్ జాకెట్ల పంపిణీ


రెగ్జిన్ జాకెట్‌లను పంపిణీ చేస్తున్న కమిషనర్ యాదగిరి

తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆదివారం మున్సిపల్ కమిషనర్ యాదగిరి రెగ్జిన్ జాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చడంలో కార్మికులది కీలక పాత్ర అని కొనియడారు. వార్డుల్లో తిరుగుతూ చెత్తను తొలగించాలని సూచించారు. కార్మికులకు డ్రెస్‌కోడ్ ఉండాలనే జాకెట్లు పంపిణీ చేశామన్నారు. మున్సిపల్ డీఈ మణిపాల్, ఏఈ హుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేశ్ పాల్గొన్నారు.

మంచం పట్టిన మాజీ సర్పంచ్

- చేసిన పనులకు బిల్లులు రాక మనోవేదన

మర్పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌గా గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో మనస్తాపానికి గురైన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని మల్లికార్జునగిరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మయ్య మంచాన పడ్డాడు. ఈయన 2019 జనవరిలో జరిగిన ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా గెలుపొందారు. అదే సంవత్సరం గ్రామం నూతన పంచాయతీగా మారడంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. 2022-23లో సీసీ రోడ్ల నిర్మాణానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీడీఎఫ్ కింద రూ.5 లక్షలు మంజూరు చేసింది. అప్పు చేసి ఆ పనులు పూర్తి చేశాడు. గ్రామంలో వైకుంఠ ధామం నిర్మాణానికి మరో రూ.12లక్షలు మంజూరు కాగా ఎంబీలు రికార్డు చేసి అధికారులకు అందించారు. దీంట్లో కేవలం రూ.5లక్షలు మంజూరు కాగా మిగతా డబ్బుల కోసం అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యంతో మంచాన పడ్డాడు. మూడు నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ రూ.15లక్షల వరకు అప్పు చేసి ఖర్చు పెట్టినా ఆరోగ్యం కుదుటపడలేదు. తనకున్న రెండెకరాల భూమిని సైతం తాకట్టు పెట్టి రూ.10లక్షల అప్పు చేశానని, భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి మరో రూ.3లక్షల అప్పు చేశానని లక్ష్మయ్య కన్నీరుమున్నీరవుతున్నాడు. కుమార్తె ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ కళాశాలకు వెళ్లగా డబ్బులు కట్టలేని స్థితిలో చదువు మధ్యలోనే ఆపేసినట్లు లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులను అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.


అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ లక్ష్మయ్య



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్లపై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాల తోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పొంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పొంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.



సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న పీఆర్‌టీయూ-టీఎస్ ఉపాధ్యాయులు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

» నేటి ఇందిరాపార్కు మహాధర్నాకు తరలాలి
» పీఆర్‌టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పిలుపు

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు భూతంగా పరిణమించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎస్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నా విజయవంతానికి ఆదివారం వికారాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహాధర్నాకు అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరు కావాలని చంద్రశేఖర్ కోరారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయ, ఉద్యోగులకూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా మహాధర్నాను తలపెట్టామన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేసి పాత పెన్షన్ హక్కు సాధనలో అందరం భాగస్వాములు కావాలని, సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతం అనేది చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ మండలాలు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి

» షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ



దశరథ్ దంపతులను సన్మానిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

కద్దాల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పని తీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు సమాజ సేవకు పునరంకితం కావాలని కోరారు. కద్దాల పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు విధులు నిర్వహించి రిటైర్ అవుతున్న తాటికొండ దశరథ్‌కు ఆదివారం స్టేషన్ ఆవరణలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ గంగాధర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమానికి ఏసీపీ హాజరయ్యారు. దశరథ్ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు, అధికారులు ప్రజల అభిమానం చూరగొంటారన్నారు. దశరథ్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేశ్, శ్రీకాంత్, ఏఎస్ఐ బాల్‌రెడ్డి, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు గూడూరు శ్రీనివాస‌రెడ్డి, గూడూరు లక్ష్మీనర్సింహా, లాయక్ అలీ, వెంకటేశ్, కృష్ణ, మహేశ్, అంజి, కరుణాకర్, సురేశ్, బిచ్యానాయక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కట్టక ఇక్కట్లు

తంగళ్లపల్లి వాగుపై రాకపోకలు బంద్

» చుట్టూ తిరిగి వెళ్తున్న ప్రజలు
» మూడేళ్ల కింద పాత వంతెన కూల్చివేత
» పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం



తాత్కాలిక రోడ్డుపై వెళ్తూ వాగులో బోల్తా పడిన డీసీఎం(ఫైల్)

కొందుర్గు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి వాగుకు రెండు మూడు మండలాల క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నీరొచ్చే ఉధృతంగా ప్రవహించి నల్గొండ జిల్లా డిండి ప్రాజెక్టుకు చేరుతుంది. చిన్న వర్షాలకైనా వాగులో నీటి ప్రవాహం ఉంటుంది. ఈ వాగుపై నిర్మాణాలు చేపట్టాలంటే ఇంజినీరింగ్ అధికారులు నీటి ప్రవాహం, కాలాన్ని బట్టి పనులు చేయాల్సి ఉంటుంది. రెండు జిల్లాలను కలిపే ఆర్అండ్‌బీ రోడ్డు ఈ వాగుపై నుంచే వెళ్తోంది. వాహనాల రద్దీ ఉంటుంది. ఇలాంటి వాగుపై పాతవంతెనను మూడేళ్ల కింద తవ్వి పనులు చేయకుండా వదిలేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది వాగుపై రాకపోకలు పూర్తిగా నిలిచాయి. పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి పాలకులు పట్టించుకోక ఐదారు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

రూ.3.2కోట్లతో పనులు చేపట్టి ...

తంగళ్లపల్లి వాగుపై పది మీటర్ల వెడల్పుతో నాలుగు పిల్లర్లపై వాగు నిర్మించాల్సి ఉంది. రోడ్డు పనులు పూర్తయిన మూడేళ్లకు బ్రిడ్జి కోసం రూ.3.2కోట్ల అంచనాతో 2023 జూన్‌లో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాత వంతెనను కూల్చే సరికే వరదలొచ్చాయి. మట్టిరోడ్డు వేసి పనులు నిలిపేశారు. ఈ లోగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం తదితర కారణాలతో పనులు పడకేశాయి. ఎండకాలంలోనూ పనులు చేయలేదు. తంగళ్లపల్లి వాగుపై బ్రిడ్జి లేక కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడెం మండలాల, మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు అందుబాటులో ఉన్నపుడు రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల ప్రయాణానికి కొందుర్గు, కొల్లూరు, నవాబ్‌పేటల మీదుగా వెళ్లేవారు. బ్రిడ్జి నిర్మాణం కాక ఇప్పుడు షాద్‌నగర్, జడ్చర్ల మీదుగా 70కి.మీలకుపైగా అదనంగా తిరగాల్సి వస్తోంది. వెంకిర్యాల, ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల వారు వాగు ఉధృతికి నేరుగా కొందుర్గుకు రాలేకపోతున్నారు. 5కిలో మీటర్లు ఉన్న మండల కేంద్రానికి చుట్టూ 15కిలో మీటర్లు తిరిగి చేరుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం విశ్వనాథ్‌పూర్‌నకు చెందిన శంకరయ్యగౌడ్(45) అనే వ్యక్తి కాస్లాబాద్ మీదుగా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. తంగళ్లపల్లి వాగుపై సాధ్యమైనంత త్వరగా బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మూడేళ్లుగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొట్టుకుపోయిన తంగళ్లపల్లి-వెంకిర్యాల తాత్కాలిక కల్వర్టు

ఇబ్బంది పడుతున్నాం.. బ్రిడ్జి నిర్మించాలి



మూడేళ్లుగా వాగు వచ్చే సమయంలో రోడ్డు బంద్లై అవస్థలు పడుతున్నాం. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి పోతున్నాం. పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా వాగు ఉధృతి తగ్గగానే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

- లింగంగౌడ్, మాజీ సర్పంచ్, వెంకిర్యాల

కాంగ్రెస్‌లో సేవాదళ్ పాత్ర కీలకం

» డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



జాతీయ జెండాను ఎగురవేసిన చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ పాత్ర కీలకమైందని టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు గడగుటి హరికృష్ణ, మండల నాయకులు రమాకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ జెండాను పీసీసీ మెంబరు దేప భాస్కర్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ తీగల అనితారెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవాదళ్ పార్టీ అభివృద్ధికి పనిచేస్తుందన్నారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో ఐదు గ్రాస్ రూట్ సంస్థల్లో కాంగ్రెస్ సేవాదళ్ ఒకటన్నారు. జిల్లా స్థాయిలో మహేశ్వరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 1923లో కాకినాడ కాంగ్రెస్ సమావేశంలో బ్రిటిష్ వారిపై పోరాడేందుకు మొదట యువజన సంస్థగా 'హిందుస్థానీ సేవాదళ్‌'ను స్థాపించారని తెలిపారు. అగ్రనేతలను బ్రిటిష్ పాలకులు జైలులో పెట్టినపుడు ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని అందించేలా సేవాదళ్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకి ఈశ్వర్, యాదయ్య, కుమార్, జంగయ్య, రాజునాయక్, పాండునాయక్, సుభాన్‌యాదవ్, శ్రీధర్, రాజు, నవీన్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ కల్యాణి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కీసర రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుడాలని క్రాంతికిన్ అకాడమీ ప్రిన్సిపాల్ కల్యాణి అన్నారు. ఆదివారం దమ్మాయిగూడలోని మొక్క నాటు-గిఫ్ట్ పట్టు కార్యక్రమంలో గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ప్రతి పది మందిలో ఒకరిని ఎంపిక చేసి స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ఒకరికి ప్రత్యేక బహుమతిగా రేంజర్ సైకిల్‌ను ఇచ్చారు. విద్యార్థులు చేసిన మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రాంతికిన్ ఫౌండేషన్ డైరెక్టర్ పీఎస్ఆర్ క్రాంతి, లావణ్య, ఫౌండేషన్ సభ్యులు సంతోష్, కవిత, సంధ్య, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న జగన్మోహన్

పరిగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో రాజ్యాధికారాన్ని సాధించేందుకు ముదిరాజ్ కులస్థులంతా సంఘటితం కావాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ అన్నారు. ఆదివారం పరిగిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌ల జనాభా ప్రకారం హక్కులు పొందాలని, అందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆరు శాతం జనాభా ఉన్న సామాజిక వర్గానికి రాష్ట్రంలో 42మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, 15శాతం జనాభా ఉన్న ముదిరాజ్‌ల నుంచి ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 20మంది మాత్రమే ముదిరాజ్ ఎమ్మెల్యేలయ్యారని, రెడ్లు మాత్రం 422 మంది అయ్యారని తెలిపారు. ముదిరాజ్ కులం అణచివేతకు గురవుతోందన్నారు. నిజాయితీకి మారుపేరైన ముదిరాజ్‌లను రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లలో ఎన్ని సంఘాలున్నా హక్కుల కోసం కలసిరావాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో ముదిరాజ్‌లు గెలిచేలా ప్రయత్నాలు జరుగాలన్నారు. సర్పంచ్, ఎంటీసీలు స్థానాలు గెలుచుకుంటే ఎమ్మెల్యేలుగా గెలిచే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జూపల్లి రామస్వామి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి, మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకటయ్య, పాలమూరు జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, పరిగి తాలుకా అధ్యక్ష,కార్యదర్శులు టి.రామస్వామి, శ్రీశైలం, ఉపాధ్యక్షుడు శేరి బిచ్చన్న, నాయకులు కె.రామకృష్ణ, పి.చిన్ననర్సింహులు, చంద్రలింగం, చందు, ప్రకాష్, బసప్ప, వీరన్న,నర్సింహులు,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌ను కలిసిన కమిషనర్


చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కమిషనర్ యాదగిరి

తాండూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన యాదగిరి ఆదివారం తాండూరు ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడంతో పాటు మొక్కను అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరుణం పురుషోత్తంరావు, రవి ఉన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఉదయ్ శంకర్

తాండూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఎస్‌టీవో, బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు, వీరశైవ లింగాయత్ బలిజ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పటేల్ ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంటు వేణు, తదితరులు ఉన్నారు.

రైతన్న కష్టం.. వరద పాలు!

- నీటిలోనే పంటచేలు
- కుళ్లిపోతున్న పత్తి, కంది పంటలు
- రైతన్నలకు తీవ్ర నష్టం

బషీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షాలతో రైతులను నిండా ముంచాయి. పగలు, రాత్రి కష్టించి సాగుచేసిన పంట పొలాలకు తీవ్రనష్టం వాటిల్లింది. బషీరాబాద్ మండల వ్యాప్తంగా నల్ల రేగడి భూములు అత్యధికంగా ఉన్నాయి. ఈ పొలాలు పత్తి సాగుకు అనుకూలంగా ఉండటంతో సుమారు 12వేల ఎకరాలకు పైగా


క్యాద్గీరా వద్ద నీట మునిగిన పత్తి చేను


నవాంద్గీ వద్ద పంట పొలాల్లోకి వచ్చిన వరద

పత్తి, 5వేల ఎకరాల్లో కంది వంటి ప్రధాన పంటలు రైతులు సాగుచేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో అడపాదడపా కురిసిన వర్షాలకు పత్తి పంటలు ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. కాగా పత్తికి ఇప్పటికే ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడులు పెట్టి రైతులు పంటలు సాగు చేస్తుండగా, భారీ వర్షాలు కొందరిని నిండాముంచాయి. కాగా మండలం మీదుగా ప్రవహిస్తున్న కాగ్నానది పరివాహక ప్రాంత గ్రామాలైన నవాంద్గీ, ఇందర్‌చెడ్, గంగ్వార్, క్యాద్గీరా వద్ద నది ఉప్పొంగడంతో పత్తి, కంది చేనులు చెరువులను తలపించాయి. ఆయా గ్రామాల్లో సుమారు 80ఎకరాల వరకు పత్తి, కంది, పెసర, ఇతర పంటలు నీటమునిగాయి. ఇదిలా ఉండగా పంట పొలాల్లో రోజుల తరబడి వర్షం నీరు నిలవడంతో పత్తి, కంది పంటలు దెబ్బతిని కుళ్లిపోతున్నాయి. వర్షాలతో పలు గ్రామాల్లో చేతికొచ్చిన పెసర పంట పూర్తిగా పాడైంది. ఈ పరిస్థితి నదీ పరివాహక ప్రాంత గ్రామాలతో పాటు లోతట్టు పంట పొలాల్లో ఎక్కువగా ఉంది. ఆయా గ్రామాల రైతులు పొలాల్లో నిల్వనీటిని తొలగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలకు 1500 ఎకరాలకు వరకు పత్తి, కంది, ఇతర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు సమాచారం. ఎప్పటికప్పుడూ వ్యవసాయాధికారులు పంట పొలాల్లో నీరు తొలగించాలని రైతులకు చెబుతున్నారు.

పంటలు వరద నీటి పాలయ్యాయి



రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. కాగ్నానది పక్కన పొలం ఉండటంతో భారీ వర్షాలకు నీట మునిగింది. వారం గడుస్తున్నా నీరు తగ్గడంలేదు. పంట పూర్తిగా పాడైపోతోంది. గ్రామంలో దాదాపు 20 ఎకరాల వరకు పంటలకు నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలి.

- శ్రీనివాస్, రైతు క్యాద్గీరా బషీరాబాద్ మండలం

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వినాయక నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఐదోరోజు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. దండాలయ్యా.. ఉండ్రాలయ్యా అంటూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. పలు మండపాల వద్ద లడ్డూవేలం నిర్వహించారు. అన్నదానం చేశారు.


పరిగిలోని శ్రీనివాసకాలనీ ప్రశాంతి నిలయంలో పూజలందుకుంటున్న శ్రీవరసిద్ధి వినాయకుడు


మోమిన్‌పేట్: 108 రకాల ప్రసాదాలతో గణనాథుడికి నైవేద్యం


తాండూరు: కన్య పాఠశాల వద్ద వినాయకుడి లడ్డును రూ.3లక్షల 1,116లకు కైవసం చేసుకున్న మనీష్ →


పెద్దేముల్: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న మంబాపూర్ గ్రామస్తులు


కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్‌లో రూ.24వేలకు గణేశ్ లడ్డూను దక్కించుకున్న శ్రీరాములు →


ధారూరు: ధారూరులో వినాయక ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు


తాండూరు: పాత తాండూరు గడి కోట నుంచి ఊరేగింపుగా బయల్దేరిన గణనాథుడు


తాండూరు రూరల్: వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి →


కొడంగల్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు


వికారాబాద్: న్యూకలెక్టరేట్ కాలనీలోని వినాయక మండపంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి


బంట్వారం: తోర్మామిడిలో మణికంఠ యూత్ ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న గణనాథుడు


యాలాల: గణపతిని ట్రాక్టర్లపై తరలించేందుకు తీసుకెళ్తున్న దృశ్యం


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో క్రేన్ సాయంతో వినాయకుడి నిమజ్జనం


దోమ: మోత్కూర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

హరినామస్మరణ చేయాలి


మాట్లాడుతున్న వక్త వారణాసి శ్రీరామచంద్రమూర్తి

వికారాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో ఆయువు ఉన్నప్పుడే ఆయాసం రానప్పుడు హరినామస్మరణ చేయాలని ప్రముఖ వక్త వారణాసి శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. సత్యసాయి జ్ఞానకేంద్రం వికారాబాద్ 23వ వార్షికోత్సవంలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సత్యసాయి పంచరతనాలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను పాటించాలన్నారు. పరమాత్ముడిని నమ్ముకున్న వారు ఎన్నటికీ చెడిపోరని, కలియుగంలో నామస్మరణ చాలా ముఖ్యమన్నారు. సభ అధ్యక్షులు హారతి ద్వారక నాథ్ మాట్లాడుతూ.. సత్యసాయి జ్ఞాన కేంద్రం విద్య వైజ్ఞానిక సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక రంగాలలో ముందడుగు వేస్తూ నిర్మాణాత్మకమైన పాత్రను పోషించుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ సింగ్ ఠాకూర్, పశువైద్య నిపుణులు పున్నయ్య, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, బందప్పగౌడ్, పాపయ్య, సతీష్ చంద్ర, విఠోబా పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

వికారాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ తలపెట్టిన మహాధర్నాను ఇందిరాపార్క్ వద్ద విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుకై తలపెట్టిన ఈ మహాధర్నాలో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

బంట్వారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కమ్మర్పల్లి సుక్కమ్మ(68) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందడంతో వారు పేద కుటుంబానికి చెందిన వారు వారికి అంత్యక్రియల కోసం గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వారి కుటుంబానికి రూ.6,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆమె భర్త కమ్మర్పల్లి మొగలప్పకు నగదును అందించారు.

ప్రధానిపై రాహుల్ వ్యాఖ్యలు సరైనవి కావు


మర్పల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు


తాండూరు: రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


పరిగిలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మర్పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరైనవి కావని బీజేపీ మర్పల్లి మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను ఖండించారు. అనంతరం రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో బలరామ్‌గౌడ్, శ్రీమంత్ కుమార్, నాగన్న, జైపాల్, శ్రీకాంత్, గణేశ్ పాల్గొన్నారు.

తాండూరు: బీజేపీ తాండూరు పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోదీ మాతృమూర్తిని కించపరిచే విధంగా మాట్లాడినందుకు గానూ ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటేల్ విజయ్ కుమార్, సుదర్శన్ గౌడ్, కృష్ణ, కిరణ్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: బిహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి పెంటయ్య, మండల అధ్యక్షురాలు అనసూయ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు హరికృష్ణ, శ్యాంసుందర్, వీరేష్,రమేశ్, భీమయ్య, సుభాన్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని వీరారెడ్డి విగ్రహం వద్ద ఆదివారం రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను పార్టీ మున్సిపల్ అధ్యక్షు డు తప్పెట్ల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పకపోతే జిల్లా కలెక్టరేట్‌లో పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందాల శ్రీనివాస్, సుధాకర్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, పరమేష్‌గౌడ్, హన్మంతు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మోదీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ కార్యక్తలు ఘట్‌కేసర్‌లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, ప్రభంజన్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ రమేష్, మాధవి, మమత పాల్గొన్నారు.


శామీర్‌పేట్: మూడుచింతలపల్లిలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


ఘట్‌కేసర్‌లో నాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

స్థానిక సమరానికి సమాయత్తం

(ఐదో పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బీసీలకు, ఇతర వర్గాలకు రిజర్వేషన్ల శాతాన్ని ఖరారు చేస్తారు. ఎన్నికల సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనేది ప్రభుత్వం నుంచి సమాచారం అందగానే రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుంది.

10న ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ఖరారు

జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసేందుకు సన్నాహాలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించి కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఖరారుకు ఆగస్టు 26న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 6న ప్రారంభమయ్యే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ఖరారు ప్రక్రియ 10వ తేదీతో ముగియనుంది. 6న మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించాల్సి ఉంటుంది. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఆ రోజు నుంచి 8వ తేదీ వరకు స్వీకరించాలి. 9న వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిష్కరించడంపై నిర్ణయం తీసుకోనున్నారు. 8న జిల్లా స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. అదేరోజు మండల స్థాయిలో ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. 10న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాలు ప్రచురించనున్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి కొండాపూర్ రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దుద్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అల్లిఖాన్‌పల్లికి చెందిన మంగలి పెంటయ్య పని నిమిత్తం ఆదివారం దుద్యాల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో దుద్యాల్ సమీపంలోని గోపన్ చెరువు కట్టపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి చెరువు కట్ట కిందికి దూసుకెళ్లాడు. పెంటయ్య చెట్ల పొదల్లో పడిపోవడాన్ని గమనించిన స్థానికులు ఆయనను బయటకు తీశారు. ప్రమాదంలో స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. అల్లిఖాన్‌పల్లి నుంచి దుద్యాల మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో గోపన్‌చెరువు కట్ట ప్రమాదకరంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

దాడి సంఘటనలో వ్యక్తికి రిమాండ్

దౌల్తాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తన తల్లిని చంపాడని కక్ష పెంచుకొని మండలంలోని ఈర్లపల్లి కి చెందిన లోడుగుల భీములు అదే గ్రామానికి చెందిన బాబును శనివారం కత్తితో దాడి చేసిన విషయం విదితమే. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం భీమప్పను అరెస్టు చేశారు. దాడికి పాల్పడిన భీమప్పను కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా 14రోజుల రిమాండ్ విధించినట్లు దౌల్తాబాద్ ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన మరో నిందితుడి రిమాండ్

శామీర్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విలేకరుల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడిన మరో మూడో నిందితుడు ఆదివారం శామీర్‌పేట పోలీసులు రిమాండ్ చేశారు. సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమ వసూళ్లకు, దౌర్జన్యాలకు పాల్పడిన ఇద్దరు విలేకరులైన నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. కాగా వీరితో పాటు మూడో నిందితుడు శనివారం పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉండడంతో పోలీసులు ఎట్టకేలకు ఆదివారం పట్టుకుని రిమాండ్ చేశారు.

నిందితులపై మరో 8 ఫిర్యాదులు

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నిందితులపై ఆదివారం ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు సీఐ శ్రీనాథ్ మీడియాకు వెల్లడించారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన తొమ్మిది మంది బాధితుల్లో ఒకరు శనివారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ


విజయేందర్

ధారూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఆయనను పరిగి తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. ఆయన స్థానంలో కొత్త వారిని ఇంకా ఎవరినీ నియమించలేదు.

ముదిరాజ్‌లు ఐక్యతను చాటాలి


మాట్లాడుతున్న టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ ముదిరాజ్

దౌల్తాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు ఐక్యతను చాటాలని టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర బోయిన మహేశ్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని మాటూర్ గ్రామంలో టీఎంపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం కోట్ల హనుమంతు అధ్యక్షతన జరిగిన పల్లెబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ వర్గంలోని అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన ఏకైక జాతి ముదిరాజ్‌లు అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా ముదిరాజ్ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, అశోక్, రంజిత్, శేఖర్, శ్రీనివాస్, కూర వెంకటయ్య, కూర వెంకట్రాములు పాల్గొన్నారు.


ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

కొడంగల్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ సాధనకు సీపీఎస్ ఉద్యోగులు తలపెట్టిన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ అన్నారు. ఆయన కొడంగల్‌లో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆత్మగౌరవసభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

కులకచర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రంగ రాములు, ఉపాధ్యక్షులుగా రాములు, కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శులుగా రాజు, గణేశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు


ధర్మేంద్ర ప్రధాన్‌తో నాయకులు

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాండూరు జినుగుర్తిలో ఆదివారం పర్యటించిన కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను వికారాబాద్ జిల్లా బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయననుకలిసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, కేపీరాజు, వివేకానందరెడ్డి, అనిల్ ఉన్నారు.

వికారాబాద్‌లో 6న వినాయక నిమజ్జనోత్సవం

వికారాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో వినాయక నిమజ్జనాన్ని ఈ నెల 6న నిర్వహించేందుకు నిర్ణయించామని హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ కృష్ణపంతులు పేర్కొన్నారు. పట్టణంలోని రామ మందిరంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం వినాయక నిమజ్జనం శోభయాత్ర ఏర్పాట్లపై వినాయక మండపాల నిర్వాహకులతోటి ఆయా శాఖల అధికారులతో , ప్రజా ప్రతినిధులతో ప్రజలతో సమావేశం నిర్వహించారు.